# నువ్వు రాముడవే! నేను సీతను కాను!!

-పోట్లూరు సుబ్రహ్మణ్యం

**యూ**నివర్సిటీలో శ్రీరామ్, సీతాలక్ష్మిని మొదటి చూపు లోనే ప్రేమించాడు. ఆమె ముఖం ఎంతో నిర్మలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఎక్కడా అహంకారపు ఛాయలు కనిపించవు. ఆమె ముఖం ఎంతసేపు చూసినా తనివి తీరదు. ఆమె అతిలోక సుందరి కాదు. కాని అందగత్తె. ఆమె కంటే ఎంతో అందమయిన ఆడపిల్లలు ఆ కాలేజీలో ఉన్నా ఎందుకో అతనికి ఆమె మీద మనసయింది.

రోజులు గడిచేకొద్దీ ఆమె మీద ఆకర్షణ ఎక్కువయింది శ్రీరామ్‌కి. ఒంటరిగా ఎదురయితే ఆమె ముఖారవిందాన్ని తనివితీరా చూసేవాడు, అంతే తప్ప ధైర్యం చేసి ఆమె నెప్పుడూ పలుకరించలేకపోయాడు. కారణం ఇన్ని జరుగుతున్నా ఆమె ఏనాడూ స్పందించి ఇతని ముఖం వైపు చూడకపోవడమే.

చివరకు ఎంతో ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆ రోజు కాలేజీకి ఒంటరిగా వస్తున్న సీతాలక్ష్మిని పలుకరించి, తన మనసులోని మాట ధైర్యంగా చెప్పేసాడు.

"సీతాలక్ష్మి గారూ, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నా నండీ. మీరిష్టపడితే పెళ్లి చేసుకుంటాను."

సీతాలక్ష్మి ముఖంలో ఏ భావమూ కనిపించలేదు.

"నేను పోస్టు గ్రాడ్యుయేట్ అయ్యేంతవరకూ పెళ్లి చేయకూడదనేది మా తల్లిదండ్రుల ఆలోచన. దానిని గౌరవించడం నా ధర్మం. రెండవది మా అమ్మా నాన్న లకు నచ్చిన అబ్బాయినే పెళ్లిచేసుకుంటాను. ఇందుకు ఏలాంటి మినహాయింపులూ లేవు" సూటిగా చెప్పి అతని సమాధానానికి కూడా ఎదురు చూడకుండా వడివడిగా వెళ్లిపోయింది సీతాలక్ష్మి.

❖ ❖ ❖

ఇది జరిగిన మూడవ రోజు ఆమె పేర కాలేజీకొక ఉత్తరం వచ్చింది. ఫ్రం అడ్రస్ చూసింది. శ్రీరామ్.

ఉత్తరాన్ని చించకుండా పుస్తకం మధ్యలో పెట్టుకుని ఇంటికి వెళ్లిన తరువాత తన టేబులు డ్రాలో పడేసింది. మరుసటి రోజు శ్రీరామ్ ఎదురయినా ఏ భావమూ లేకుండా వెళ్లిపోయింది.

శ్రీరామ్‌కు ఏమీ అర్థం కాలేదు. తన ప్రేమనంతా రంగరించి వ్రాసిన ఆ ఉత్తరానికి ఆమె ఏమీ స్పందించక పోవడం అతనికి ఆశ్చర్యంగా ఉంది.

రోజులు గడుస్తున్నాయి. ఎక్కడ ఆమె తనకు దక్క కుండా పోతుందోనని తన గాఢమైన ప్రేమను వివరిస్తూ అతను ప్రేమలేఖలు వ్రాస్తూనే ఉన్నాడు. ఆమె ఆ ఉత్తరాలు అందుకుంటూనే ఉంది. వాటిని చించకుండా తన టేబులు సొరుగులో వేస్తూనే ఉంది. ఆమెను అప్పు డప్పుడూ పలుకరించేవాడు. ఆమె ఎంతో మర్యాదగా మాట్లాడేది. అంతే తప్ప అతని దగ్గర ఉత్తరాల ప్రస్తా వన తెచ్చేది కాదు. ఇద్దరూ స్నేహితుల్లానే ప్రవర్తించే వారు.

యూనివర్సిటీ చదువు పూర్తయి వారి రిజల్ట్సు వచ్చాయి. ఇద్దరూ ఫస్టు క్లాసులో పాసయ్యారు.

"రేపు మీ ఇంటికి మా తల్లిదండ్రులను తీసుకొని పెళ్లి చూపుల కొద్దామనుకుంటున్నాను. రమ్మంటావా" తన ఊరి నుంచి ధైర్యంచేసి సీతాలక్ష్మితో ఫోనులో మాట్లాడాడు.

"తరువాత చెప్తా" అంటూ ఫోను పెట్టేసింది సీతాలక్ష్మి.

తల్లిదండ్రులకు దాపరికం లేకుండా జరిగిందంతా చెప్పేసింది సీతాలక్ష్మి. అంతేగాక గత రెండేళ్లుగా శ్రీరామ్ వ్రాసిన ఉత్తరాలను సంచి నిండుగా వేసుకుని వచ్చి వాళ్ల ముందు బోర్లించింది.

"ఇవి శ్రీరామ్ నన్ను పెళ్లి చేసుకుంటానంటూ వ్రాసిన ఉత్తరాలు. ఆ రోజు నుంచీ ఈ రోజు వరకూ నాది ఒకే మాట. మీరు సరేనంటేనే నా పెళ్లి జరుగు తుంది."

తమ ఏకైక సంతానం సీతాలక్ష్మి తమ ముందు కుప్పగా పోసిన ఆ ప్రేమలేఖలు చించను కూడా చించ లేదు. తమ పెంపకంలో ఎదిగిన కుమార్తె సంస్కారానికి ఆ తల్లిదండ్రులు ఆమెను మనసులోనే అభినందించారు. ఒక్కొక్క ప్రేమలేఖా చించి చదివారు. అన్నీ చాలా సభ్యతగా ఉన్నాయి. ఆ లేఖల్లో శ్రీరామ్‌కు తమ కుమార్తె మీదున్న ప్రగాఢమయిన ప్రేమ అర్థమయింది.

సీతాలక్ష్మి ఫోను అందుకుని మరుసటి రోజు శ్రీరామ్ తన తల్లిదండ్రులతో రావడం, రెండు కుటుంబాల వారికి ఒకరినొకరు నచ్చడం, వెంటనే పెళ్లి ముహూ ర్తాలు పెట్టుకోవడం జరిగింది. పెళ్లి కూడా నెల

రోజుల్లో జరిగిపోయింది. కాలేజి క్లాస్‌మేట్స్ చాలా మంది వచ్చారు.

❖ ❖ ❖

సీతాలక్ష్మి, శ్రీరామ్‌ల జీవితం పూలబాటలా సాగిపోతూ ఉంది. ఆమె తన సర్వస్వాన్నీ అతనికి అర్పించింది. పెళ్లికి ముందు అంత రిజర్వుడుగా ఉండే సీతాలక్ష్మి పెళ్లయిన తరువాత తనను ఇంత గాఢంగా ప్రేమించడం అతనికి అద్భుతంగా ఉంది.

శ్రీరామ్‌కు త్వరలోనే కాలేజి లెక్చరరుగా ఉద్యోగ మొచ్చింది. భార్యతో వెళ్లి ఆ ఊళ్లో కాపురం పెట్టాడు. సీతాలక్ష్మి ఏ ఉద్యోగానికి అప్లయి చెయ్యలేదు.

"ఉద్యోగం ఇద్దరికీ ఒకేచోట వస్తుందన్న నమ్మకం లేదు. మనం ఒకరికొకరికి వియోగం తప్పదు. మనం పూర్తి ప్రేమను ఆస్వాదించే క్షణాలు వృథా అవుతాయి. మనం కలసి తింటూ, కలసి బ్రతికే సమయాన్ని కొద్దిగా కూడా పోగొట్టుకోలేను" తన్మయత్వంతో సీతాలక్ష్మి కళ్ల వెంట ఆనందబాష్పాలు రాలాయి.

ఆమెకు తనమీదున్న గాఢమైన ప్రేమకు చలించి పోయిన శ్రీరామ్‌కు కళ్లు చెమర్చాయి.

రోజులు గడుస్తున్నాయి. వాళ్ల అన్యోన్య దాంపత్యానికి సాక్షిగా ఆడపిల్ల పుట్టింది. ముద్దులొలుకుతూ పెరుగుతున్న ఆ పాపను చూస్తే అతనికెంతో ఆనందంగా ఉంది. ఇద్దరికీ ఒక సంపూర్ణ జీవితాన్ని గడుపుతున్న భావన ఉంది.

మరో మూడేళ్లకు మళ్లీ గర్భం ధరించిన సీతాలక్ష్మి మళ్లీ ఆడపిల్లను ప్రసవించింది. నిరాశ పడిపోయాడు శ్రీరామ్. ఒక ఆడపిల్ల. ఒక మగ పిల్లవాడు. తరువాత ఆపరేషన్ చేయించుకోవాలనేది అతని కోరిక. కాని రెండసారి కూడా ఆడపిల్లే పుట్టడంతో అతని ఆశ అడియాస అయింది. భర్త అసంతృప్తికి సీతాలక్ష్మి చాలా బాధపడింది.

మరో మూడేళ్లకు మళ్లీ గర్భవతి అయింది సీతాలక్ష్మి. శ్రీరామ్‌కు చాలా టెన్షన్‌గా ఉంది. మగపిల్లవాడి కోసం ఎదురుచూడసాగాడు. గుళ్లు, గోపురాలు తిరుగుతున్నారు భార్యాభర్తలిద్దరూ.

స్థలం మారితే ఫలితముంటుందని, నెలలు నిండగానే భార్యను మూడవ కాన్పుకు పిల్లలతో సహా పుట్టింటికి పంపాడు. చివరకు ఫలితం ఆడపిల్ల పుట్టింది.

వార్త తెలిసిన పది రోజులకు గాని భార్యను, బిడ్డను చూడ్డానికి వెళ్లలేదు శ్రీరామ్. భార్యతో పొడిపొడిగా మాట్లాడాడు. పిల్లలతో ముక్తసరిగా ఉన్నాడు. అత్త మామలతో అసలు మాట్లాడలేదు.

వెళ్లిన రెండు గంటల తరువాత, భార్య బ్రతిమాలినా వినకుండా, పిల్లలు ఏడుస్తున్నా పట్టించుకోకుండా తిరుగు బస్సెక్కాడు.

సీతాలక్ష్మి బాధ వర్ణనాతీతం. 'భగవంతుడా మాకిన్ని కష్టాలు ఎందుకు కల్పిస్తావు. ఒక్క మగబిడ్డను ఇచ్చి ఆయనకు సంతోషాన్ని కలిగించకూడదా' అంటూ విలపించింది.

భర్తకు భోజనానికి ఇబ్బందిగా ఉంటుందని, బిడ్డకు మూడోనెల రాగానే భర్త పిలవకుండానే వచ్చేసింది సీతాలక్ష్మి.

## 'స్వాగతమా సర్వజిత్తు'

వ్యయముతో తల బొప్పికట్టింది
ఏదో అనుకుంటే ఏదో అయింది
ఆదాయం నిల్ వ్యయం ఫుల్
ఇంతవరకు
మసిపూసి మారేడుకాయ చేయడం చూశాం
ఇక సర్వజిత్తు ఏం చేస్తుందో చూద్దాం
సర్వజిత్తులోనే ఉంది
ఎంత జిత్తులమారో ఈ సంవత్సరం
ఉగాది ఊసులు
అప్పుడూ, ఇప్పుడూ మరెప్పుడూ
ఆశల సంచులే.
వత్సరం ప్రతి సంవత్సరం
దగా పడుతూనే ఉన్నా
ఏడాదే నిండకున్నా
ఎగతాళి చేస్తున్న నిండుకున్న గాదె
ఉగాది పండుగ అనగానే
వేప పచ్చడి, కోయిల కుహుకుహులు
కొత్త ఆశలు, కొంగొత్త ఆశయాలు
అనాది నుండి వస్తున్న ఉగాది
వేస్తుంది ఆశలకు పునాది
సర్వజిత్తు 'సర్వజనా సుఖినో భవంతు' అని
ఋతురాగాలను వినిపిస్తుందా
సగటు మనిషిని ఆదుకుంటుందా?
స్వగతంలో గతాన్ని మరచి
స్వాగతించమంటుందా?

–కొలనుపాక మురళీధరరావు

శ్రీరామ్ ఆమెతో ముభావంగానే ఉన్నాడు. అతని చేష్టలు ఆమెకెంతో బాధను కలిగిస్తున్నాయి. ఆమె ఎప్పుడూ ఆలోచించేది ఒక్కటే..

'సంసారంలో భార్యాభర్తలిరువురూ సమానమయి నప్పుడు, ఆడపిల్లను కనడంలో భార్యది తప్పెలా అవుతుంది? ఎందుకు ఈయనకిది అర్థంకాదు.'

మరో మూడేళ్లు గడిచాయి. సీతాలక్ష్మి జీవితం నిస్సారంగా, నిరాసక్తంగా గడుపుతోంది.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తతో తనకు నెల తప్పిందని చెప్పలేక చెప్పింది సీతాలక్ష్మి.

శిలా ప్రతిమ అయిపోయాడు శ్రీరామ్. తను విన్నది కలా? నిజమా?? కలకాదు నిజమేనని సిగ్గుతో కందిన ఆమె ముఖం చెబుతోంది.

తనవైపు పిచ్చివాడిలా చూస్తున్న భర్తను అనునయి స్తున్నట్టుగా అంది.

"ఈసారి తప్పకుండా మగబిడ్డ పుడతాడని నాకెంతో ఆత్మవిశ్వాసం ఉంది. ముగ్గురు ఆడబిడ్డలు పుట్టిన తరువాత మగబిడ్డ పుట్టిన సందర్భాలు మావైపు కుటుం బాల్లో చాలా ఉన్నాయి. ఈ బిడ్డతో మనం ఫుల్‌స్టాప్ పెట్టేద్దాం."

శ్రీరామ్‌లో ఏ మార్పూ లేదు. అలాగే కళ్లు విప్పార్చి సీతాలక్ష్మి వైపు నిస్తేజంగా చూడసాగాడు.

తను, భార్య మూడవ కాన్పు అమ్మగారింట్లో ఉన్నప్పుడు ఆడపిల్ల పుట్టిందని ఆవేశంతో వచ్చి, వారం రోజులు సెలవుపడేసి స్నేహితుడు సింహాద్రి తోడురాగా నగరంలోని ఒక డాక్టరు దగ్గర ఫ్యామిలీ ప్లానింగు ఆపరేషను చేయించుకున్నాడు. భార్యకు ఈ విషయం చెప్పలేదు. అలాంటప్పుడు ఈ గర్భం ఎలా కలిగింది? 'మీకు మగబిడ్డనిచ్చి సంతోషం కలిగిస్తానండీ' అనే భార్య మాటల్లోని అంతరార్థం ఇదేనా!

తను ప్రేమించి పెళ్లిచేసుకున్న సీతాలక్ష్మి తనను మోసం చేసిందా? ఎంత దారుణం. తను ఈ విపరీ తాన్ని తట్టుకోగలడా? భార్యతో మాట్లాడలేదు. రాత్రంతా నిద్రలేకుండా ఇదే ఆలోచనలతో గడిపాడు.

ఈ హఠాత్పరిణామం అర్థంకాని సీతాలక్ష్మి కారణమేమిటని అతన్ని నిలదీసింది. 'ఇష్టమైతే ఉండు. లేకపోతే వెళ్లిపో' అన్నాడు. ఆత్మాభిమానం గల సీతా లక్ష్మి మారు మాట్లాడలేదు. అంతేగాక తొందరచేసి సీతాలక్ష్మిని, పిల్లల్ని తనే దగ్గరుండి అత్తగారింట్లో వదిలి పెట్టాడు శ్రీరామ్.

"సీతా! నిన్ను గాఢంగా ప్రేమించిన నన్ను మోసం చేశావు. మూడేళ్ల క్రిందట ఆపరేషను చేయించుకున్న నాకు మళ్లీ సంతానం కలగడం ఎంత దౌర్భాగ్యం. వెంటనే గర్భస్రావం చేయించుకో. నీకూ గౌరవంగా ఉంటుంది" అనేసి వెళ్లిపోయాడు. తన మాటలకు స్పృహ తప్పి పడిపోయిన భార్యను కూడా గమ నించలేదు.

❖ ❖ ❖

ఛ... ఎంత బుద్ధిలేని పని చేశావురా రామూ" అన్నాడు సింహాద్రి.

శ్రీరామ్ తలవంచుకున్నాడు. ఇద్దరూ హోటల్లో ఓ మూల కూర్చుని ఉన్నారు.

సంవత్సరం క్రితం ట్రాన్సఫరయి వెళ్లిన సింహాద్రి ఏదో పనిమీద వచ్చి, మిత్రుణ్ణి చూడ్డానికి వచ్చాడు.

కళావిహీనంగా, బలహీనంగా, సర్వస్వం కోల్పోయిన వాడిలా ఇంటి ముందు కుర్చీలో కూర్చొని ఉన్న శ్రీరామ్‌ని వెంటనే గుర్తుపట్టలేకపోయాడు. చాలా కాలంగా ఆలనా పాలనా లేనట్లున్న ఇల్లు, ఇంటి పరిసరాలు కనిపించాయి. ఇంట్లోకి వెళ్లిన సింహాద్రి, సీతాలక్ష్మిని, పిల్లల్ని అడిగాడు.

ఇంత కాలానికి కనిపించిన ఆంతరంగిక మిత్రుడు సింహాద్రి దగ్గర తాను అబద్దాలు చెప్పి తప్పించుకోలేనని భావించిన శ్రీరామ్, తాను అంత గాఢంగా ప్రేమించిన సీతాలక్ష్మి తనకు చేసిన అన్యాయం గురించి చెప్పి దుఃఖించాడు.

## నవ వసంతము

వచ్చిందోయ్ వచ్చింది వచ్చిందోయ్ నవ వసంతము
మానవత్వం మల్లెతీగెకు స్నేహపుష్ప సుగంధము
రజత భరణుల చందము

నవ నవోద్భవ కరుణ రసముల చూత పుష్పపు పరిమళం
సమత మమతల భ్రమర స్వరముల మధుర గీతిక కలకలం
హాయి నొసగే మధుర వచనపు పికగళంబుల పంచమం

సోదరత్వపు వింట వెడలిన సామరస్యపు సాయకం
వసుధ కురిసే ప్రేమ చినుకుల వాత్సల్యపూరిత నిస్వనం
విశ్వమంతా అంకురించెను సహనశీలత నవదళం
దానవత్వం తరిమికొట్టే మానవులమే కదా స్రష్టలం
ఈ అవిరత వసంత స్రష్టలం!

—బాణగిరి వసుంధర

సింహాద్రి మాట్లాడలేదు. ఇద్దరూ ఓ గంటలో రెడీ అయి బయటికి నడిచారు. శ్రీరామ్‌ను ఒక ప్రముఖ డాక్టరు దగ్గరకు బలవంతంగా తీసుకెళ్లాడు. పరీక్ష చేసిన డాక్టరు, శ్రీరామ్‌కు చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషను ఫెయిలయిందని, ఆనాడు సరిగా చేయ లేదని, మరలా చేయించుకోవాలని చెప్పాడు.

ఆస్పత్రి దగ్గరలోని ఓ హోటలుకు తీసుకెళ్లి శ్రీరామ్‌ను ముఖం వాచేట్లు చీవాట్లు పెట్టాడు సింహాద్రి.

"బిడ్డ పుట్టిన తరువాత డాక్టరు చేత ఎందుకు పరీక్ష చేయించుకోలేదు. వెంటనే భార్యను అనుమా నించడమేనా? నువ్వు చేసిన పనికి సీతాలక్ష్మి ఎంత నరకం అనుభవించి ఉంటుంది. సంవత్సరం నుంచీ భార్యా బిడ్డల్ని చూడకుండా ఎలా ఉండగలిగావురా? వెళ్లు. వెంటనే వెళ్లి భార్యాబిడ్డల్ని తీసుకొచ్చుకో. ఒం గోలు నుంచి విజయవాడ ఎంతసేపు."

శ్రీరామ్ వంచిన తల ఎత్తలేదు. తను చేసిన నీచపు పనికి పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. కళ్లలోంచి నీరు ధారాపాతంగా కారిపోతున్నాయి.

"సీతాలక్ష్మి చాలా మంచిది. చేసిన పనికి క్షమాపణ చెప్పుకో. నిన్ను మన్నిస్తుంది. నేను ఆఫీసు పనిమీద మద్రాసు వెళుతున్నాను. తిరిగి వచ్చేప్పుడు ఇక్కడే దిగుతాను" అన్నాడు సింహాద్రి.

నమ్మకంగా తల ఊపాడు శ్రీరామ్. అంతేకాదు, సింహాద్రి తనే దగ్గరుండి శ్రీరామ్‌ను విజయవాడ బస్సెక్కించాడు.

❖ ❖ ❖

శ్రీరామ్ విజయవాడలో బస్సు దిగి, మామగారిం టికి ఆటోలో బయలుదేరాడు. భార్య ఎన్ని చీవాట్లు పెట్టినా తను చేసిన పనికి భార్యా పిల్లలకు పదే పదే క్షమాపణలు చెప్పుకోదలిచాడు. అంతకంటే మరో మార్గం లేదు.

ఆటో బిల్లు పేచేసి మెయిను గేటు దగ్గరకు నడిచాడు. ఎప్పుడెప్పుడు భార్యాపిల్లల్ని చూస్తానా అని ఆతృత పడుతున్న అతనికి ఇంటి ఆవరణ లోపల కొత్త వ్యక్తులు తిరగడం కనిపించింది. తటపటాయిస్తూ లోపలికి వెళ్లబోతుండగా పరిచయమున్న ప్రక్కింటాయన శ్రీరామ్‌ను పిలిచాడు. శ్రీరామ్ అటువైపు కదిలాడు.

లోపల నుంచి ఏదో కవరు తెచ్చి శ్రీరామ్ చేతికిచ్చి, "సీతాలక్ష్మికి ఆరు నెలల క్రితం మగబిడ్డ పుట్టాడు. నెల క్రితం ఆమెకెక్కడో ఉద్యోగమొచ్చింది. ఇల్లమ్ముకొని వెంటనే వెళ్లిపోయారంతా. నువ్వొస్తే ఈ కవరివ్వమంది" అని చెప్పి మరో మాటకు తావివ్వకుండా దభాలున తలుపు మూసుకున్నాడాయన. కనీసం కూర్చోమని కూడా చెప్పలేదు.

జరిగింది తెలుసుకుని మాట కోల్పోయిన శ్రీరామ్, కాళ్లు తడబడగా రోడ్డుమీదికొచ్చి వణుకుతున్న చేతులతో కవరు చించాడు.

మిస్టర్ శ్రీరామ్!

యుగాలు మారినా, తరాలు మారినా మనిషి అంతరాలు మాత్రం మారలేదు. ఎక్కడ నిజమైన ప్రేమ ఉంటుందో అక్కడ అనుమానాలకు తావుండదు. నీ ప్రేమ నిజమైనది కాదని నన్ను ఇంట్లోంచి బహిష్కరించి నప్పుడే అర్థమయింది. ఈ సంవత్సర కాలంలో పిల్లలు నీకోసం పలువరించని క్షణం లేదు. నీ రాకకోసం ఎదురు చూడని రోజు లేదు. ఇప్పుడిప్పుడే ప్రపంచాన్ని అర్థం చేసుకుంటున్న పెద్దమ్మాయి, 'అమ్మా నాన్న మనల్ని వదిలేశాడు గదమ్మా' అని అడిగింది. 'అవు'నని చెప్పాను. ఇక నాన్నను మరచిపొమ్మని తన చెల్లెళ్లకు చెప్పి అనునయించింది. అందరూ వాళ్ల తమ్ముడ్ని ముద్దు చేస్తున్నారు.

దూర ప్రదేశంలో నాకు మంచి ఉద్యోగమే దొరి కింది. ఆడపిల్లల్ని వ్యక్తిత్వం కలవారిగా, మగపిల్లవాడ్ని ఆదర్శవంతుడిగా తయారు చేస్తాను.

**నువ్వు రాముడివే!**

నీకు ఏకపత్నీ వ్రతుడైన రాముడికున్న అన్ని సద్గుణాలతో బాటు, భార్యను అనుమానించే దుర్గుణం కూడా ఉంది. ఆనాడు రాముడు సీతను అడవుల్లో వదిలాడు. కాకపోతే నువ్వు ఈ సీతాలక్ష్మిని జనా రణ్యంలో వదిలావు.

**నేను సీతను కాదు!!**

కారణం.. నేను సీతవంటి పతివ్రతనే. కాని సీత లాంటి అబలను కాదు. భర్తను తలచుకుంటూ నిరం తరం దుఃఖించే అమాయకురాలిని అంతకంటే కాదు. నా కాళ్ళమీద నిలబడి నా బిడ్డలను నేను పోషించుకోగల ఆత్మవిశ్వాసం నాకుంది. ఏది విరిగినా అతకవచ్చును గాని, మనసు విరిగితే అతకలేరు. నిన్ను నా మనసులోంచి బహిష్కరించాను.

నీకు ఏమీ కాని

సీతాలక్ష్మి

శ్రీరామ్ చేతుల్లోంచి ఉత్తరం ఎగిరిపోయింది.

"సీతా" అంటూ గావుకేక పెట్టి రోడ్డుమీదే కూలి పోయాడు శ్రీరామ్. ■